# స్త్రీలు * సమస్యలు

ఎ.ఎస్. రాజశేఖర్

" రాధా! రాధా!" అంటూ చేతిలో ఓ పుస్తకంతో ఇంట్లోకి ప్రవేశించాడు ఆనంద్.

డ్రాయింగ్‌రూంలో ఒంటరిగా కూర్చొని సీరియస్‌గా టి.వి. చూస్తోంది ఎనిమిదేళ్ళ సాహితి.



"అమ్మేది సాహితీ!" అని అడుగుతూ టి.వి. వేపు చూసేడు. ఆ తర్వాత అదిరిపడ్డాడు. "ఆవు పేడతో వంట మరియు మంట" కార్యక్రమమది.

దు:ఖం పొంగి వచ్చింది.

"ఎనిమిదేళ్ళకే ఇంత వైరాగ్యం దేనికమ్మా!" అన్నాడు బరువుగా.

"వాళ్ళ టీచర్ టి.వి. కార్యక్రమాలమీద వ్యాసం వ్రాసుకురమ్మందట కానీ మీరిలా లోపలకు రండి." అంది రాధ మధ్యరూమ్‌లోనుండి.

"నువ్విక్కడున్నావా రాధా! ఈ రోజు నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి" అంటూ లోపలికెళ్లాడు.

లోపల నేలనలుకుతూ కన్పించింది రాధ. ముఖం నిండా అలసట. తలంతా రేగిపోయి వుంది. ప్రక్కనే నీళ్ళ బక్కెట్. చేతిలో బట్ట.

ఆ స్థితిలో రాధను చూస్తూనే ఒక్కసారిగా నిరుత్సాహం ప్రవేశించింది ఆనంద్‌లో. కానీ "స్త్రీలు-సమస్యలు" పుస్తకంలో తను చదివిన విషయం గుర్తుతెచ్చుకొని "రాధా! నీకెందుకింత బాధ" అన్నాడు అదేదో సినిమాలో కమల్‌లా.

"పని మనిషి కొడుక్కి ఆక్సిడెంట్ అయింది. అది ఏడుస్తుంటే, నేనుకూడా హాస్పిటల్‌కు వెళ్ళి ఇపుడే వచ్చాను" ఆయాసంగా చెప్పింది రాధ.

"హా- నన్ను చేస్కున్నందుకు నీకెన్ని కష్టాలు రాధా!" అన్నాడు ట్రాజిక్ హీరోలా.

ఇంతలో వంటింట్లోనుంచి సుపుత్రులిద్దరూ ఒకరు గరిటె, మరొకరు కవ్వంతో 'కత్తిఫైట్" చేస్కొంటూ దూసుకొచ్చారు.

"ఒరేయ్. చంపుతా! బైటకు పదండి" గట్టిగా అరిచింది రాధ.

ఒకడు ఆనంద్‌ను రాసుకొంటూ, మరొకడు ఆనంద్ మోకాలి చిప్పను కవ్వంతో పగులగొడుతూ బైటికెళ్ళారు.

"వీళ్ళింత గూండా వెధవలయ్యారే!" అన్నాడు ఆనంద్.

"నా మనుమలిద్దరికీ మావాడి పోలికలే అంటారు మామగారు" చిన్న రిటార్టిచ్చింది.

"మానాన్నేదో అన్నంత మాత్రాన నేను గూండా వెధవనా!" ఉద్రేకపడిపోయాడు.

" అని ఎవరన్నారండీ! మీనాన్నగారనే మాట చెప్పానంతే! అది సరేగానీ ఇంతకుముందేదో రాధా-బాధ అన్నారు" గుర్తుచేసింది.

"ఆ.. నన్ను చేసుకున్నందుకు నీకెన్ని కష్టాలు రాధా!" అన్నాడు తిరిగి.

"అసలు సంగతేంటో చెప్పండి. మీ స్నేహితుడెవరినైనా రాత్రి భోజనానికి పిలిచారా!"

"హతవిధీ! స్నేహితులను భోజనానికి పిల్చిన రోజునే నీ కష్టాలను గమనించినట్లుగా మాట్లాడుతావేం రాధా!"

ఇలా నేల నలుకుతూ- అంట్లు తోముతూ, బట్టలుతుకుతూ- అయ్యో! నేనెంత విలన్‌ని" వాపోయాడు.

"ఇలా దగ్గరగా వచ్చి నోరు తెరవండి" అంది రాధ.

"ఎందుకు?"

"మీ పైత్యం చూస్తుంటే ఏ మందు పార్టీనో పావనం చేసొస్తున్నట్లున్నారు.

ఈ పని రోజూవుండేదేం కాదుగా! ఈరోజు పనిమనిషి రాలేదు. అంతే. పెద్ద కొండలు పిండిచేయడం లేదుగా!" అంటూ బకెట్ తీస్కొని లోపలకెళ్లింది.

"అసలు భారతదేశంలో ఎంతమంది ఆడవారిలా వంటపనికీ, ఇంటి పనికీ అంకితమై తమలోని సృజనాత్మకతను, భావుకతను, భాగ్యరేఖను కోల్పోతున్నారో నీకు తెలుసా! అంటూ తనూ ఆమెను అనుసరించాడు.

"మధ్యలో భాగ్యరేఖేమిటి?" చేతులు కడుక్కొంటూ అడిగింది.

"ఏదో వచ్చింది. వాడేశాను- అడ్డురాకు. ఇలా పురుషాహంకార దర్పానికి ఊడిగం చేస్తూ. ఉస్సూరుమంటున్న ఆడవారు ఉన్మత్తులై, తిరగబడకముందే వారిలో ఉత్సాహాన్ని

ఉత్తేజాన్ని నింపి---" ఆయాసంతో ఆగడంతో కాఫీగ్లాసందిచ్చింది రాధ.

"అసలు సంగతేమిటి? క్రిందటి నెలలోలా ఏదన్నా టోపీ వేయించుకొచ్చి, దాన్ని కప్పిపుచ్చేందుకు ఈ ఉపన్యాసమా!"

క్రిందటినెల ఎక్కువ వడ్డీ వస్తుందని ఓ చిట్‌ఫండ్ కంపెనీలో వెయ్యి రూపాయలు డిపాజిట్ చేసాడు. అదికాస్తా పదిహేను రోజుల్లో బిచాణా ఎత్తేసింది.

"ఛ...ఛ.. కాదు రాధా! ఈరోజు ఆఫీస్‌లో లంచవర్లో దుర్భాక వెంకట నరసింహాచారి అనే సినీ రైటర్ వచ్చాడు. ఆయన వ్రాసిన "స్త్రీలు-సమస్యలు" నవలను మా స్టాఫంతా కొంటుంటే నేనూ కొన్నాను. అందులో మన భారత స్త్రీలు పడే సమస్యలన్నీ సవివరంగా వ్రాసాడు"చెప్పాడు.

"ఆ నవలతోపాటూ ఓ తలనొప్పి మాత్ర ఫ్రీగా ఇచ్చుండాలే!"

"కాదు. వాత్సాయన సూత్రాలు బోనస్ బుక్" అనేసి నాలుక్కర్చుకున్నాడు.

"ముగ్గురు పిల్లల తండ్రయ్యుండీ అలాంటి పుస్తకాలు కొనేందుకు మీకేం పాడుబుద్ధండీ!" చిరుకోపంగా అంది.

"అదేం కొనలేదు. నేను డబ్బులిచ్చింది "స్త్రీలు-సమస్యలు" అనే నవలకు- అది ఫ్రీ గిఫ్ట్" సర్ది చెప్పాడు.

"సర్లెండి. సినీ రైటరా! ఏ సినిమాకు కథ రాసాడేమిటి?" అడిగింది.

"గొబ్బెమ్మదే విజయం" అనే సినిమాకు ఆయన రైటర్ కమ్ ప్రొడ్యూసర్"

"గొబ్బెమ్మలదే విజయం అనే సినిమానా! నేనెప్పుడూ వినలేదే? ఎప్పుడొచ్చిందట" నవ్వుతూ అడిగింది.

" నేను డిగ్రీ చదివేటప్పుడు వచ్చింది. అందులో 'కన్నెదాన్ని తొంగుంటా! రారా బంగరు సామీ!' అనే హిట్‌సాంగ్ కూడా వుంది" రాధ ప్రశ్నకు ఉత్సాహంగా జవాబిచ్చాడు.


"రామరామా! బూతుపాటలు పాడికూడా వివరించాలా! నాకు బోలెడు పనుంది కానీ మీరు వెళ్ళి టి.వి. కట్టేయండి. ఆ కార్యక్రమం పూర్తిగా చూస్తే సాహితికి పిచ్చెక్కుతుంది."

"మరేం ఫర్లేదు. అది నా కూతురు."

"స్త్రీలు-సమస్యలు"లో రచయిత ఏం చెపుతాడంటే ప్రతి స్త్రీకి ఓ లక్ష్యం, గమ్యం, ఓ ఆశయం వుండా......" చెప్తున్న ఆనంద్ వీపుకు బలంగా క్రికెట్ బంతి వచ్చి తగలడంతో 'అమ్మా!' అంటూ ఆగి వీపు తడుముకొన్నాడు.

బంతి ఎక్కడినుండొచ్చిందా అని వెనకకు తిరిగిచూస్తే డ్రాయింగ్ రూంలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ కనబడ్డారు పుత్రరత్నాలిద్దరూ

"వెధవల్లారా! కలర్ టీ.వి. వుందక్క-



# స్త్రీలు-సమస్యలు

డ. బైటకు పదండి" అన్న ఆనంద్ అరుపుకు భయపడి బైటకు పరుగుదీశారిద్దరూ.

"చూశారా వీళ్ళ ప్రతాపం. వీళ్ళను కనిపెట్టుకొని వుండేసరికే నాకు టైం సరిపోతుంది. ఇంక ఉద్యోగలేమిటి?"

"ఆ నిరాశా వాదమే వుండకూడదంటారు దుర్భాక సంకట విరహాచారి. ప్రతి ఒక్క భారత నారికీ మొదట ఆర్థిక బలం, పుష్టి-తుష్టి (ఇది ఆనంద్ ప్రయోగం) వుండాలంటే....."

"నెర్విమాల్ట్ తాగాలా!" మధ్యలో అంది రాధ.

"జోకులెయ్యకు. వుండాలంటే వుద్యోగం చేసి మగాడికి దీటుగా నిలబడాలి" అని పూర్తి చేసాడు.

"నాకు మీ అమ్మగారు చెప్పిన విషయం గుర్తొస్తోంది" చెప్పింది.

"ఏమిటి? ప్రతిస్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలని చెప్పిందా" ఆసక్తిగా అడిగాడు.

"కాదు. మనం క్రొత్తగా పెళ్ళై, ఈ వూరికొస్తున్నప్పుడు అందరిముందూ "మావాడుట్టి పనికిమాలిన వెధవమ్మా! బ్యాంకుద్యోగం చేస్తున్నాడన్నమాటేగాని కొంచెం కూడా ప్రపంచజ్ఞానం లేదు" అని చెప్పిన విషయం తాపీగా చెప్పింది.

" ఆ విషయం ఇప్పుడెందుకు గుర్తొచ్చింది."

"అదొక్కటేనా! లేక నేను ట్రాఫిక్ ఎస్.ఐ.తో మొట్టికాయలు తినడం, అది చూసి మీ ఫ్రెండ్ వచ్చి నీకు చెప్పడం- ఇది కూడా గుర్తొచ్చిందా!" ఉక్రోషంగా అడిగాడు.

" ఆ విషయం రాలేదులెండి. అయినా సందర్భం వచ్చింది కాబట్టి అడుగుతున్నాను. అసలా ఎస్.ఐ. మీకెందుకు మొట్టికాయలేసాడు?"

"వాడో క్రాక్. హెల్మెట్ లేకుండా వెళ్తుంటే ఫైన్ వేయకుండా మొట్టికాయలేసాడు. ఆరోజు నాకే కాదు. హెల్మెట్ లేకుండా వున్నవాళ్ళందరికీ వేసాడు" అని- చెప్పి మళ్ళీ 'స్త్రీలు- సమస్యలు' గుర్తొచ్చి విషయం మొదలుపెట్టబోయి "అయినా అపుడెపుడో మా అమ్మ అన్న మాటలు ఇపుడెందుకు గుర్తొచ్చాయి" అడిగాడు.

"లేకపోతే ఏంటండీ! వాడేదో పనికిమాలిన నవలను మీకు తగలగడితే ఇరవయ్యో, ముప్ఫయ్యో వదిలించుకున్నది చాలక, అది చదివి వచ్చి నాకు లెక్చర్..... ఇక నాకు అత్తగారన్నమాటలు ఎందుకు గుర్తుకురావు?" ఉడికిస్తూ అంది రాధ.

రాధ ప్లాన్ ఏమంటే ఆనంద్‌కు కొద్దిగా కోపం తెప్పిస్తే వెళ్ళి డ్రాయింగ్ రూంలో కూర్చుంటాడని. తను పని త్వరగా ముగించొచ్చని.

కానీ ఆనంద్ "స్త్రీలు-సమస్యలు" నవల ప్రభావంతో ప్రతి స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలంటాడు రచయిత. అందుకు వుద్యోగం చేయాలి స్త్రీలంతా!"

"అయితే ఇదంతా నాతో తిరిగి వుద్యోగం చేయించేందుకు ప్లాన్ అన్నమాట. అయినా మన సాహితి పుట్టేంతవరకూ నేనూ జాబ్ చేసాగా!

అపుడేమో నా కూతురికి ఏమన్నాతక్కువైతే నేనూర్కోను అని నేను రిజైన్ చేసేంతవరకూ నాప్రాణం తీసేరు. ఇపుడేమో తిరిగి వుద్యోగం అంటున్నారు" గ్యాస్‌స్టవ్‌మీద వుడుకుతున్న అన్నం కలుపుతూ అంది రాధ.

"ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనినీ ప్రతిపక్షం విమర్శిస్తున్నట్లు నేను చెప్పిన ప్రతి విషయానికీ ఓ విమర్శ ఎందుకోయ్?" కోపంగా అన్నాడు.

"నేనేమీ విమర్శించడంలేదు. తెలుగు నవలలు చదివి మీ అభిప్రాయాలెలా మారిపోతున్నాయో చెప్పానంతే.

సరే. ఇపుడు నేనేం చేయాలో క్లుప్తంగా చెప్పేయండి. అవతల నాకు బోలెడు పనుంది. రేపుకూడా పనిమనిషి రాదట."అంది రాధ.

"ముందు ఇలా నాకు చాలా పనుంది. బట్టలుతుక్కోవాలనో - వడియాలు పెట్టుకోవాలనో అనటం మానేయాలి. ఆ తర్వాత ఇలా మాసిపోయిన చీరతో, అలసిపోయి వుండకూడదు."

"మరి ఇంటి పనెవరు చేస్తారు? నేను నీట్‌గా తయారై అలంకరించుకొని కూర్చుంటాను. వంటెవరు చేస్తారు? మీరు చేస్తారా!" మధ్యలో అడిగింది.

"ఓ! వైనాట్?"అంటూ ఆవేశంలో చూసుకోక వేడెక్కివున్న అన్నం గిన్నెను ముట్టుకొని 'కెవ్వ'మన్నాడు.

"ఇలానేనా!" నవ్వాపుకొంటూ అడిగింది.

తాత్కాలికంగా"స్త్రీలు-సమస్యలు" పుస్తకాన్ని మర్చిపోయి "నేనిలా చేయికాలి ఛస్తుంటే నువ్వలా నవ్వుతూ వుండు. బర్నాల్ ఎక్కడ?" గట్టిగా అరిచాడు.

"ఆ అలమరలో వుంది"

విసురుగా అలమర దగ్గరకెళ్ళి బర్నాల్ ట్యూబ్ వత్తి, చేతి వ్రేళ్ళకు వ్రాసుకున్నాడు. ఆ తర్వాత పైకప్పెగిరిపోయేలా పెడబొబ్బ పెట్టేడు.

"ఏమైందండీ!" అంటూ పరుగున వచ్చింది రాధ.

ఆనంద్ పట్టుకొన్న ట్యూబ్‌ను పరీక్షగా చూసి 'బర్నాల్ రాసుకోమంటే షేవింగ్ క్రీమ్

## కొత్త శీర్షిక

## ఆంధ్రసచిత్రవారపత్రిక

"న్యాయపీఠం" శీర్షిక క్రింద పాఠకుల సందేహాలకు సమాధానాలు ప్రారంభించ దలిచాము !

మీ ప్రశ్నలు క్లుప్తంగా - సూటిగా - సాధ్యమైనంత చిన్నవిగా వుండాలి. ఈ క్రింది కూపన్ నింపి మీ ప్రశ్నకి జతచేయాలి. ప్రశ్న క్రింద కూడా మీ పేరు, వూరిపేరూ రాయాలి- మీ పూర్తి చిరునామా, పిన్‌కోడ్ వెయ్యాలి. జవాబులు ఇవ్వదగిన ప్రశ్నలకు ప్రముఖ న్యాయవాది - న్యాయశాస్త్ర విషయాల గ్రంథకర్త అయిన - శ్రీ బి. బి. రావు - జవాబులు ఇస్తారు.

న్యాయపీఠం - ప్రశ్నోత్తరాలు

ప్రశ్న పంపినవారి పేరు...........................................

చిరునామా.........................................................

\- సం.

త్వరలో!

## భలే పెళ్ళి

కడుపుబ్బ నవ్వించే సీరియల్
హాస్య నవలికల పోటీలో
రెండవ బహుమతిపొందిన రచన

రాస్తే మంటెక్కదూ!" అని బర్నాల్ వెతికి రాసింది.

బర్నాల్ స్థానంలో షేవింగ్ క్రీం ఎవరు పెట్టారోనని తేల్చేందుకు బైటికెళ్ళాడు ఆనంద్ చేయికి గాలి వూదుకుంటూ.

తాత్కాలికంగా "స్త్రీలు-సమస్యలు"నుమర్చిపోయినా రాత్రి పడుకోబోయేముందు తిరిగి ఆ ప్రసక్తి తెచ్చాడు.

"రాధా!"

"ఆ..!" ఆవులిస్తూ అంది.

"చూడు. ఇలా ఆవులింతకు కారణం ఈ పనే. ఈ సమస్యకు పేరు -పేరు' అంటూ తడుముకొని 'అనామిక సమస్య' అంటారు 'స్త్రీలు- సమస్యలు' రచయిత. దిప్రాబ్లమ్ హాస్ నో నేమ్-" వివరించాడు.

"అయితే ఏమిటట?"

"మరేం లేదు. రేపట్నుండి నువ్వు-కూడా ఏదన్నా క్రియేటివ్ వర్క్ చేయాలి వుద్యోగమన్నా చేయి లేదా సోషల్ వర్క్ చేసే మహిళా సమాజంలోనన్నా చేరు. అంతేకానీ నీలోని సామర్థ్యం, పనితనమంతా ఇలా పక్కలేస్తూ వేస్ట్ చేయకూడదు. ఆఖరుకు తెలుగు పత్రికలకు సీరియల్ అన్నా వ్రాయి" అన్నాడు.

"మీ జీతమెంత?" సీరియస్‌గా అడిగింది.

"ఆఫీసరయ్యాను కాబట్టి మూడువేలు" అన్నాడు.

"మీరు మూడువేలు సంపాదిస్తూ, మన కుటుంబం హాయిగా వున్నపుడు నేనుద్యోగం చేయడమెందుకు?"

"ఏదో హాబీగా!" నసిగాడు.

"ఇలా హాబీగా వుద్యోగాలు చేసే ఆడవారుకూడా నిరుద్యోగం పెరగడానికి ఓ కారణం. కుటుంబం ఖర్చులు ఎక్కువై వుద్యోగం తప్పనిసరైనపుడు వుద్యోగం చేయాలే కానీ, తోచకనో, హాబీగా అనో వుద్యోగం చేయడం, ఆ వుద్యోగం నిజంగా అవసరమైన ఓ నిరుద్యోగికి అన్యాయం చెయ్యడమనే నా ఉద్దేశ్యం.

మీరనుకొన్నట్లుగా ఇంటిపని, వంటపనితో నేనేం అలసిపోవడంలేదు ఇది ప్రతి గృహిణీ చేసే పనే ఈ పని చేయడంలో నాకు ఆనందం వుంది.

అసలు మీకు తెలుసా! తను ప్రేమించే వ్యక్తీ, తనను ప్రేమించే వ్యక్తీ అయిన భర్తకు చిన్న చిన్న పనులు చెయ్యడంలో ఎంతో ఆనందకరమైన భావన వుంటుంది అలా ఆనందకరమైన భావన లేకుండా గొణుక్కుంటూ భర్త చేతికి కాఫీ అందిస్తే, వారిద్దరి కాపురంలో ఏదో లోపం వుందనే నా వుద్దేశ్యం.

ప్రేమ ఫలాలైన పిల్లల ఆలనా పాలనా చూసుకోవడంలో కూడా అంతే ఆనందం వుంది.

వీటన్నింటిని వదిలేసి ఉదయాన్నే ఇంత టిఫిన్ తిని, ఉరుకులు, పరుగులతో లంచ్ సర్దుకొని బస్సుల్లో వేళ్లాడుతూ ఆఫీసులకెళ్ళి, సాయంత్రం చీకటి పడ్డాక ఇంటికొచ్చే ఆడవారి ముఖాలు మాత్రం అందంగా వుంటాయా! వారు మాత్రం అలసిపోవడంలేదూ! అసలు ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళలో "డబ్బులొస్తాయనే" భర్తపోరు భరించలేక ఉద్యోగాలు చేసేవారే కానీ, స్వతస్సిద్ధంగా చేసేవారు చాలా తక్కువ.

ఇక మీరన్నట్లుగా ఆర్థిక స్వాతంత్ర్యం. వుద్యోగాలు చేసే ఆడవారు మాకు ఆర్థిక స్వాతంత్ర్యం వుంది. మా జీతాలను ఒకటో తారీఖు సాయంత్రమే మా భర్తలు లాక్కోవడం లేదు అని గుండెలమీద చెయ్యేసుకొని చెప్పమనండి చూద్దాం.

వుద్యోగం చేస్తూ కూడ, తన పుట్టింటి వారికి కష్టాల్లో కనీసం అప్పుగా తన జీతం ఇవ్వలేని మా ఫ్రెండ్ నీరజ మీకూ తెలుసు. అయితే అందరు భర్తలూ అలానే వుంటారని చెప్పలేం.

అఫ్‌కోర్స్. భార్య, భర్తలిద్దరి సంపాదనా వారి కుటుంబానికే కదా! అని మీరనొచ్చు.

ఆ విషయం వదిలేస్తే మధ్యలో సఫర్ అయ్యేది పిల్లలు. మన పిల్లలు ఎంత అల్లరిచేసినా స్కూల్లో ఎప్పుడూ ఫస్ట్‌మార్క్ వారిదే. నేనుద్యోగానికి బయల్దేరితే వారితో హోం వర్క్ చేయించేవారెవరు? అర్థంకాని పాఠాలు చెప్పేవారెవరు?

అందుకని వుద్యోగం సంగతి మర్చిపోండి"అంటూ పూర్తిచేసింది

నిశ్శబ్దంగా అంతా విన్నాడు ఆనంద్.

"అయితే స్త్రీలు వుద్యోగం చెయ్యడం నిరుద్యోగం పెరగడానికి, అనేక సమస్యలకు దారితీస్తుందంటావ్. పోనీ ఏదన్నా క్రియేటివ్ సోషల్‌వర్క్" అన్నాడు.

"కేవలం స్త్రీలు వుద్యోగం చెయ్యడమే నిరుద్యోగం పెరుగుతుందని నేను చెప్పడంలేదు. తోచక, హాబీగా వుద్యోగాలు చేసేవారు అని అన్నాను. ఇద్దరూ కష్టపడితేకానీ నడవని కుటుంబాల్లో భార్య కూడా వుద్యోగం చెయ్యడం సమర్థనీయమే లేదా పిల్లల భవిష్యత్తు కోసం, ఇంట్లో ఏ అత్తగారో పిల్లల సంరక్షణ చేస్తున్నప్పుడు ఇద్దరూ ఉద్యోగం చేయడం కూడా మంచిదే. ఇద్దరూ పిల్లలను గాలికి వదిలేసి, హాబీగా భార్య వుద్యోగం చేయడం మాత్రమే మంచిదికాదు అంటున్నాను.

అయినా ఇది కేవలం నా వ్యక్తిగత ఉద్దేశ్యం" మంత్రముగ్ధుడైనట్లు వింటున్నాడు ఆనంద్.


"నీలో అద్భుతమైన తెలివుందోయ్. నీలాంటి తెలివైన భార్య దొరకడం నా అదృష్టం." అని"పోనీ ఆ రచయితగారి రెండో సూచన ప్రకారం సంఘ సేవ చేయొచ్చుకదా!" అన్నాడు తన పట్టు వదలకుండా

"ఈరోజు మన పని మనిషి రాలేదని చెప్పాకదా! దాని అయిదేళ్ళ కొడుకు ఆడుకొంటూ ఆటో క్రింద పడ్డాడు. ఆస్పత్రికి తీస్కెళుతూ, యాభైరూపాయల అప్పుకోసం తను పని చేస్తున్న మహిళామండలి సెక్రటరీ ఇంటికి వెళితే, యాభైరూపాయలటుంచి పనిలోకి రాకుండా వుండేందుకు మీకు మంచి సాకులే దొరుకుతాయి అని తిట్టి పంపిందట

అది "పిలగాడికి రక్తం కారిపోతాంది మీరూ నాతోపాటు ఆస్పిటల్‌కు రండమ్మా!

అని ఏడుస్తూ నా దగ్గరకొచ్చింది

నేనుకూడా హాస్పిటల్‌కు వెళ్ళి వాడికి కుట్లు వేయించి తీస్కొచ్చాను.



# వందవసంతాల చరిత్రకు సాక్షి కరవది దేవాలయం

కరవది పరిచయం ఈ సువిశాలమైన ఆంధ్రరాష్ట్రంలో ఓ మూలకు విసిరేసినట్లు కన్పించే కుగ్రామం - కరవది ప్రస్తుతం ఇది ప్రకాశంజిల్లాలోని మండలాలలో ఒకటి జిల్లా కేంద్రమైన ఒంగోలునుంచి సుమారు ఇరవై కిలో-మీటర్ల దూరంలో ఉంది

దేవాలయం ప్రాముఖ్యత ఈ గ్రామంలోని దేవాలయం ఈ సంవత్సరంతో వంద సంవత్సరాలు పూర్తిచేసుకోబోతోంది ఆలయ గోపురంపై బొమ్మలరూపంలో దేవతలు కొలువుతీరిన తీరు కన్నుల విందు గా ఉంటుంది అది సంప్రదాయసిద్ధమైన గోపురనిర్మాణం ఈ దేవాలయంలో సీతా సమేత రాములవారు, ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి మందిరాలున్నాయి అప్పట్లో కరవది గ్రామానికి చెందిన జమీందారు కీ శే శ్రీ వాకా హనుమారెడ్డిగారు 1890 లో ఈ దేవాలయం శంఖుస్థాపన చేయించారు వారి అండదండలతోనే ఈ దేవాలయ నిర్మాణం పూర్తయింది అయిదువందల గజాల ఆవరణలో విస్తరించిన ఈ దేవాలయం మనశ్శాంతి కరువైనవారికి ఓ శరణాలయం దేవాలయ ప్రాంగణంలోని ప్రశాంతత లక్కడి పవిత్రతకు తార్కాణం

శ్రీ షేక్ చినమౌలాసాహెబ్, కుమారి కాంచన వంటి ప్రఖ్యాత కళాకారులు ఈ ఊరిలో పుట్టిపెరిగినవారే ఎయిర్‌హోస్టెస్‌గా వుద్యోగపర్వంలోకి అడుగుపెట్టిన కుమారి కాంచన మంచి విద్యావంతురాలు సినిమారంగంలో చేరిన అచిరకాలంలోనే ఆమె ఉన్నత శిఖరాలను అందుకున్నారు

ఫొటోలు, రచన గిరిజా నారాయణ్

## స్త్రీలు-సమస్యలు

నేను చాలా గొప్ప పని చేసానని నన్ను నేను పొగడుకోవడంలేదు ఈమాత్రం మానవ సేవ నా చేతనైనంత చేస్తాను

కాబట్టి మీ ఫ్రెండు రచయితని మర్చిపోయి పడుకోండి నాకీ జీవితమే బాగుంది మీరు నన్నో కూపస్థమండూకమన్నా సరే ఈ ఆనంద సామ్రాజ్యానికి మీరు రాజు నేను రాణి సరేనా! " చెప్పడం ముగించింది రాధ

"అయినా నేనన్న మాట ఏదిమాత్రం సరేనన్నావ్ గనుక నా భార్య ఇంటిపనితోనే సతమతమవ కూడదు అనుకొన్నాను నువ్వేమో-- " ఏదో చెప్పబోతూ కాలిన చేయి మంచం కోడుకు తగలడంతో "అమ్మా!" అన్నాడు బాధగా

చప్పున లేచొచ్చి అతని చేయిని వళ్ళో వుంచుకొని నెమ్మదిగా రాస్తూ "బాధగా వుందా" అంది

"లేదులే! నువ్వు పడుకో! గిన్నె బాగా వేడెక్కినట్లుంది ఆవేశంగా మాట్లాడుతూ చూసుకోలేదు" అన్నాడు

" మీరన్నట్లుగా నేను బైట వుద్యోగం, సంఘ సేవ గాడిదగుడ్డు అని తిరుగుతూ వుంటే మీరిలాగే చేతుల్నూ, కాళ్ళూ కాల్చుకొంటుంటారు స్వామీ"

కాబట్టి నా ప్రియమైన శ్రీవారూ, ఆ "స్త్రీలు-సమస్యలు" నవలను మర్చిపోయి హాయిగా నిద్రపొండి గుడ్‌నైట్ మున్నితంగా ఆనంద్ చేయిని ముద్దు పెట్టుకుంటూ చెప్పింది

"నవలంటే జ్ఞాపకం వచ్చింది నువ్వు కనీసం తెలుగు పత్రికలకు నవలలన్నా వ్రాయి డియర్. అదైతే ఇంట్లో కూర్చుని చేసేదేగా! పెద్దగా కష్టపడక్కర్లేదు కూడా!" ఉత్సాహంగా చెప్పాడు

"అంటే తెలుగు సాహిత్యం మీకంత చీప్‌గా కనబడుతోందా! ఏ పనికీ పనికిరాని వాడిని రాజకీయాల్లో చేరిపొమ్మన్నట్లుగా పెద్దగా కష్టపడక్కర్లేదు నవలలు వ్రాయమంటారా!

ఈ మాట ఏ రచయితో, రచయిత్రో విన్నారంటే కలం వదిలేసి, కత్తి పట్టుకొని మీమీద యుద్ధానికి వస్తారు" అని లైట్ ఆఫ్ చేసింది

ఆనంద్ మాత్రం "స్త్రీలు- సమస్యలు" నవలని మర్చిపోయి రాధచేత "నవలలు వ్రాయించటమెలా?" అని ఆలోచిస్తూ పడుకొన్నాడు